# కుక్కర సింహం గ్రామ సింహం

రాణీ మోహన్రావు



...అరగంట సేపు గడగడా మాట్లాడి రావుగారి మొహం వేపు, చూసేడు, నరసింహం. నరసింహం సన్నగా రివట్లా వుంటాడు. బండిగూడు క్రాపు, షోడాబుడ్డీ కళ్లద్దాలు, పెదాలు దాటొచ్చే ఎత్తుపళ్ళు— డబ్బాకాకి ఫ్యాంట్‌లో తెల్లచొక్కా టక్‌చేసి చూసేవాళ్లకి ఒక కార్టూన్‌లా కన్పిస్తాడు.

నరసింహం ఓ కుక్కర్ల కంపెనీలో సేల్సుమేన్—

నరసింహం ఇంగ్లీషు (భాషను) ధాటీగా ధారాళంగా మాట్లాడుతాడు. కరక్టుగానా అంటే చెప్పలేం. అది వినేవాళ్ల జ్ఞానంబట్టి వుంటుంది. మొత్తం మీద అతనింగ్లీషు భాషంటే గ్రామర్‌కే భయమని చెప్పాలి!

నరసింహునికో రోగిష్టి తల్లి వుంది. ఆమె ఎప్పుడూ విరామం లేకుండా దగ్గుతూ వుంటూంది. తల్లి అంటే న ర సిం హా ని కి ప్రేమకాదు. ఎనలేని జాలి. ఆమె దగ్గు తగ్గాలని ఎన్నో పూజలు చేసేడు. ఎందరో బాబాలకు— సాధువులకు మొక్కేడు...ఆంధ్ర దేశంలో వున్న పుణ్య క్షేత్రాలను దర్శించేడు. ఇంగ్లీషు మందుల్లో వున్న అన్ని రకాల మందులు వాడేరు. తెలుగు మందులువాడేడు. ఫలితం కనవర్లేదు. ఇక చివరకు సంస్కృతం మందులే దిక్కు అనుకొని తూర్పుగా తిరిగి ఓ నమస్కారం చేసేడు.

నరసింహాని కిద్దరు ఆడపిల్లలు— లాంతరు పట్టుకొని ముందుకెళ్లేందుకు కొడుకులు లేకపోయినా తద్దినాలు పిండం పెట్టేందుకు వీళ్లున్నారు. దుర్భిక్షంలో అధికమాసంలా— నరసింహం భార్య (మళ్ళీ) నెల తప్పింది. ఆమె నీమధ్యే పుట్టింటికి వంపేడు నరసింహం ఇంటికి కరంట్ అవసరం లేదు. పగలు సూర్యుడు—రాత్రి చంద్రుడు—చుక్కలే ఆధారం.

నరసింహం కాళ్ల చెప్పులు అరిగేలా రోజల్లా తిరిగి, మిరపకాయతిన్న కాకిలా పార్టీల దగ్గర అరచి అరచి కుక్కర్లమ్మితే కంపెనీవాళ్ళు నెలైసరికి నరసింహాని కిచ్చేది మూడేభైలు....

ఇదీ నరసింహం జీవిత కథ మేష్టారూ!...

* * *

చెప్పండిసార్... కుర్చీలోంచి ముందుకు వంగుతూ అన్నాడు నరసింహం... రావుగారు ఇబ్బందిగా కుర్చీలో కదిలేరు

"మీరు చెప్పింది బాగానే వుంది... మీ కుక్కర్లు..."

"సార్— హియర్ మీ" రావుగారు మాట్లాడుతుంటే... అడ్డొస్తూ అన్నాడు. "ఇంతకీ మీ యింట్లో వంట దేనిమీద చేస్తారు?"

"కర్రపొయ్యిమీదండీ" నవ్వుతూ అంది రావుగారమ్మాయి.

ఆమెమాటకు నరసింహం ఖంగు తిన్నాడు.

"వ్వాట్ కర్రపొయ్యిమీదా? మీ లాంటి హైక్లాస్ ఫేమిలీస్ అలా వంట చెయ్యటం మీక్కాదుసార్ నామోషి— నాకు" అర్చేడు నర్సింహం.

"మా అమ్మాయి— ఒట్టి అల్లరి పిల్ల. మేం వంట కర్రపొయ్యిమీద చెయ్యం. గేస్ పొయ్యిమీద చేస్తాం" నెమ్మదిగా అన్నారు రావుగారు.

"హమ్మయ్య! బతికించేరు" నిట్టూరుస్తూ అన్నాడు నరసింహం.

"సార్! గేస్ పొయ్యిమీద మామూమ్మలు గిన్నెలో వంట చేస్తే అరవై నిముషాలు పడుతుంది. అదే మా కంపెనీ కుక్కర్లో అయితే..."

"రెండు గంటలు పోతుంది. కదండీ" అంది రావుగారమ్మాయి.

"నెవ్వర్... అలా అవదు బేబీ. ఓన్లీ ట్వంటీ మినిట్స్ పడుతుంది. కుక్కర్లో పాటోస్లీ వంటా. బట్ ఆల్‌సో యిడ్లీలు కూడా చేస్కోవచ్చు. మీరే డౌట్ పడక్క

ర్లేదు మా కంపెనీ కుక్కర్లనే కొనండి. బాగా మన్నుతాయ్'' హుషార్‌గా అన్నాడు నరసింహం.

రావుగారు అతనిమాటలకు ఏమీ అన్లేదు. మునిలా మౌనంగా వూరుకున్నారు.

''సార్! చెప్పండి'' ప్రాధేయంగా అన్నాడు.

''మీ కంపెనీ కుక్కర్లకన్నా— 'నలభీమా' కుక్కర్లే బాగా మన్నుతాయని మా వాళ్ళు అంటున్నారు'' రావుగారు నెమ్మదిగా అన్నారు.

నరసింహం నిరుత్సాహంగా ''అలాగే అంటారా?'' అని అంతలోనే, ధైర్యం తెచ్చుకొని— ''సార్ మీ వాళ్ళకు కావలసిన కుక్కరు అదే 'నలభీమా' కుక్కర్నే కొనండి. నే కాదనను ఏవైనా మీవాళ్ళ టైమ్మూ, మీ గ్యాసు ఆదా కావటం నా కోరిక 'నలా' కుక్కరుకొన్నా—'భీమా' కుక్కరు కొన్నా, చివరకు 'నలభీమా' కుక్కరు కొన్నా— నా ద్వారానే కొనండి ఇలా నేను మీచేతకొనిపిస్తే నాక్కొంత కమీషనొస్తుంది. అదెంతోకాదు సార్, ఒన్లీ సిక్స్టీ రూపీస్ మీ పేరు చెప్పుకొని మా ఫేమ్లీ అంతా వో వారం రోజులపాటు భోజనాలు చేస్తాం. ప్లీజ్'' ఏడ్వలేక నవ్వుతూ అన్నాడు నరసింహం— అతని కళ్ళమ్మట నీళ్ళు— నోటమ్మట ఎత్తు పళ్ళపై కొచ్చేయ్!

''అలాగే కొందాంలెండి.'' నరసింహానికి మంత్రిలా హామీ యిచ్చేరు రావుగారు.

* * *

ఓ రోజున కాఫీ హోటల్లో రావుగారిని కలేడు నరసింహం. వేళకు వంటవటంలేదనీ, తన భోజనానికి అప్పుడప్పుడూ యిబ్బంది ఔతోందని మాటల సందర్భంలో నరసింహానికి చెప్పేరు రావుగారు.

''యూ డోంట్ వర్రీ సార్— యూ సింప్లీ రైట్ యువర్ ఎడ్రస్—ఐ యూజిలీ ఎర్రైంజ్ దా కుక్కర్...'' ముక్కు కిందకు జారుతున్న కళ్ళద్దాలను పైకెగదోస్కుంటూ అన్నాడు నరసింహం.

'సాయంత్రం మా యింటికి రండి'అన్నారు రావుగారు. అలా ఆరంభమైంది రావుగారికి, నరసింహానికి స్నేహం—

* * *

రావు గారింట్లో వున్న కేలండర్లో ఆరు కాగితాలు చిరిగిపోయేయ్!

ఆఫీసులో పనులు ఎక్కువగా వుంటం వల్ల రావుగారు ఇచ్చిన హామీ మర్చిపోయేరు.

ఓ! చల్లని సాయంత్రం —

రావుగారికి పూర్ణా మార్కెట్‌లో కల్సేడు నరసింహం—''అంతా కులాసాఏనా సార్''

''ఆఁ ... ఆఁ ... అంతా కులాసాగానే వున్నాం...పనుంది... మళ్లీ కలుద్దాం'' వెళ్లి పోతున్న రావుగార్ని ఆపి! ''సార్...'నలభీమా' కుక్కర్లు మంచి రకాలు వచ్చేయ్...రండి... వెళ్దాం'' రావుగారి వేపు చూస్తూ.

''నాకు అర్జంటు పనుంది ... మరోసారి వెళ్దాం...''

''ఆల్‌రైట్ సార్ – మీరు వెళ్ళండి... రేపీవినింగ్ ఆరింటికి మీ ఇంటికొస్తాను...'' నరసింహం హుషారుగా అన్నాడు.

* * *

సూర్యుడు అస్తమించడం ఆలస్య మౌతాడేమోకాని అన్న మాట ప్రకారం మర్నాడు సాయంత్రం ఆరింటికి రావుగారింటి కొచ్చేడు నరసింహం, ఎలా అయినా రావు గారి చేత 'నలభీమా' కుక్కరు కొనిపించాలన్న పట్టుదలతో...

రావుగారి కుటుంబానికి కుక్కరు ఏలా పన్జేసేది వివరంగా చెప్పాడు నరసింహం. ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తానంటే అక్కర్లేదు మా కర్ధమైందన్నారు – రావుగారి భార్య, పిల్లా!

''సార్ ... సార్ ... నాదో రిక్వెష్ట్'' అర్ధింపుగా అన్నాడు నరసింహం.

''ఏంవిటా రిక్వెష్ట్'' రావుగారు అడిగేరు.

''మీకీ నలభీమా కుక్కర్ నా ద్వారా కొంటున్నట్టుగా మీ చుట్టాలకీ – పక్కాలకీ చెప్పకండి సార్ – ఎవరైనా మా ఆఫీసరుకి రిపోర్టు చేస్తే నా ఉద్యోగం పోతుంది...'' ప్రాధేయంగా అన్నాడు నరసింహం...

''ఎవర్కీ చెప్పంలెండి'' రావుగారి అమ్మాయి అంది.

''ఐతే ఈ కుక్కర్ను ప్రస్తుతానికి పట్టుకుపోయి వచ్చేనెల ఫస్టుకి తీస్కురండి ... అప్పుడు కొంటాం...'' రావుగారు నెమ్మదిగా అన్నారు – నరసింహం నిర్ఘాంత పోయినా ... అలవాటుగా దిగమింగి వూరు కున్నాడు. వెంటనే తేరుకుని...

''ఆఁ...చెప్పడం మర్చేను సార్ ... మీకో గుడ్ న్యూస్'' అర్చేడు నరసింహం.

''మీ జీతం పెంచారా?'' నవ్వుతూ అన్నారు రావుగారు.

''కాదు సార్...మా ఆవిడకు పురుడొచ్చింది ...అబ్బాయి పుట్టేడు'' నవ్వుతూ సంచీ లోంచి స్వీట్స్ పేకట్ తీసి విప్పి రావుగారి కుటుంబానికి తలో స్వీటు యిచ్చి ... తనో స్వీటు నోట్లో వేస్కున్నాడు-నరసింహం.

* * *

రెండు నెలల తర్వాత...

సాయంకాలం ఇంటికి నడిచి వెళ్తే మీ మలబద్ధకం 'మందు' అవసరం లేకుండా తగ్గిపోతుందన్న డాక్టర్ సలహా మీద నడుస్తున్న రావుగారు తక్కుమని ఆగేరు ... ఓ చోట –

కుక్క, దాని గొలుసూ పట్టుకొని వెనకాలే కుక్కలా నడుస్తున్న నరసింహాన్ని చూసేరు రావుగారు.

''ఏం పంతులూ ఎలా వుంది నీ కుక్కర్ల వ్యాపారం?'' హుందాగా పల్కరించేరు రావుగారు. (అతని కేన్వాసింగ్ విని కుక్కరు కొనని శ్రీ రావుగారు)

''మీరు కొన్లేదుగా?''

''ఒక్క కుక్కరు అమ్మితేగాని వారం రోజులు భోజనం వుండదన్నావ్? నీ పని బాగానే వుందే? షికారుకి చేతిలో కుక్క వ్యవహారం–''

''ఆకలేస్తుంది అన్నవాణ్ణి జోకులేసి ఏడ్పించకండి సార్ ... నే నిప్పుడు అమ్మేది కుక్కర్లు కాదు సార్''

''మరేవిటోయ్?''

''కుక్కలు''

''కుక్కలా...'' అర్చేరు రావుగారు.

''ఔన్సార్ ... కుక్కలే! టెరియర్ – బుల్డాగ్–అల్సేషియన్...వగైరా ... వగైరా ...పది కుక్కర్లు అమ్ముకునే కన్నా– ఓ కుక్కను అమ్ముకుంటే చాలు...''

రావుగారు మౌనంగా కుక్కవేపే చూడ సాగేరు.

'మంచి అల్సేషన్ ... కొంటే బావుణ్ణు' అనుకున్నారు.

''ఏవిటలా ఆలోచిస్తున్నారు ... కుక్క మంచిదే...అల్సేషియన్ కొంటారా?''

'అదే చూస్తున్నానోయ్ పంతులూ...'

'మీరు అలా ఆలోచిస్తూనే...చూస్తూనే వుంటారు ... ఈ లోగా ఎవడో కుక్కను కొనుక్కుపోయి మీ మీదకే వుస్కో పెడ్తాడు'' అంటూ ముందుకు సాగిపోయేడు గ్రామ సింహంతో నరసింహం.